# మూలం

## ప్రతిపర్ల సాంబశివరావు

స్కూటర్ స్టార్ట్ అవడం లేదు. పాత బడేకుందీ ఈ ఇబ్బందులు తప్పవు.

పదిహేనేళ్లనుండీ లెక్చరర్ ఉద్యోగం చేస్తున్నా ఓ చిన్నకారు కొనుక్కోలేక పోయాను ఇంకానయం, పెద్దలు సంపాదించి యిచ్చిపోయిన ఇల్లు ఉండబట్టి సరిపోయింది లేకపోతే ఎన్ని యిబ్బందులు పడేవాడినో!

కాలేజీకి టైం అవుతోంది

సరే! ఇవాళ కాలేజీకి పోకపోతే యేం పోయిందిలే అని ఓ లీవ్ లెటర్ వ్రాసి, స్కూలుకు పోబోతున్న మావాడికిచ్చి, కాలేజీలో ఇవ్వమని చెప్పి పంపాను

మావాడు వాకిటి దాకా వెళ్ళి మళ్లా వెనక్కి వచ్చి, 'నాన్నా! మీ కోసం ఎవరో వచ్చారు!" అని చెప్పి మరీ వెళ్లాడు నేను వాకిట్లోకి పోయాను

ఒక నడికారు పురుషుడూ, నలుగురు ఆడవాళ్లూ ఒక పిల్లవాడూ ఉన్నారు వాళ్ల శరీరాలు కాయకష్టం చేత కమిలిపోయి మొరటుగా కనబడుతున్నాయి అంతా ఉతికిన నీరు కావి బట్టలు కట్టుకొని ఉన్నారు.

"మాది మల్లాయ పాలెం!" ఆ పురుషుడన్నాడు.

నాకు అర్థమైంది. ఇప్పుడీ నాటకాలు ఏ వూళ్లోనైనా చూడవచ్చు ఇల్లు తగలబడి పోయిందనో, వరద తీసుకొచ్చాయనో, కరువొచ్చిందనో చెప్పి అడుక్కునే ముఠాలు ఎక్కువయ్యాయి. వీళ్లను ప్రోత్సహించ కూడదు

"మా యింటి పేరు. " అని ఆ వ్యక్తి వాళ్ల యింటి పేరు చెప్పాడు.

మా యింటి పేరే అది!

మా వాళ్లే నన్నమాట! ఇంకా నయం తొందరపడి తిట్టలేదు.

"నా పేరు బసవయ్య!" అన్నాడు ఆ వ్యక్తి.

వాళ్లని లోనికి రమ్మన్నాను. బసవయ్య వెంట వచ్చిన ఆడవాళ్లు భయపడుతూ భయపడుతూ లోనికి వచ్చారు

నాలో ఏమూలో ఇంకా సందేహం పీడిస్తూనే ఉంది. ఇదొక నాటకమేమో! ఇప్పుడీరకం మోసాలు గూడా ఉన్నాయి. వివరాలు తెలుసుకొని, ధూర్తపు బంధువులం అని చెప్పి, ఇంట్లో చేరి, సమయం చూచి ఇల్లు దోచుకొని పోవడం, అడ్డు వస్తే చంపడం

ఈ భావం రాగానే మళ్లా నా ముఖంలో రంగులు మారాయి

మావిడ ఇదంతా చూస్తూనే ఉంది ఆమె ముఖంలో వీళ్ల యెడ అనాదర భావం స్పష్టమవుతూనే ఉంది.

నా మౌనాన్ని ఏవిధంగా అర్థం చేసుకున్నాడో గాని బసవయ్యే మళ్లీ మాట్లాడటం మొదలు పెట్టాడు.

"నువ్వు మల్లికార్జునుడి కొడుకువు కాదంటయ్యా?"

'అవును!"

నువ్వు అని సంబోధించడంలో ఆయన ఎంతో ఆత్మీయత కనబరుస్తున్నా నాకెందుకో చికాకనిపించింది. వెధవది పదహారేళ్ల కుర్రాణ్ణి గూడా మా కాలేజీలో ఏమండీ అని పిలుస్తాం ఇంత పెద్దవాణ్ణి, అందునా లెక్చరర్ని పట్టుకొని నువ్వు అంటాడేమిటీ ఈ పల్లెటూరి బైతు

"నీ తాత సాంబయ్య దగ్గరికి నేను పదేళ్ల పిలగాడిగా ఉన్నప్పుడు మా అయ్యతో కలిసి వచ్చాను!"

బసవయ్య పక్కనున్న పిల్లాడికి ఏడెనిమిదేళ్లుంటాయి. వాడు బసవయ్య చేతిని గిల్లి, "అయ్యా! నీళ్లు!" అన్నాడు.

వాడి ముఖం చూశాను ఆ పిల్లాడి పెదవులు ఎండిపోయి వున్నాయి. కళ్లు లోనికి పీక్కు పోయి వున్నాయి నేను మావిడ వైపు చూశాను లోనికి పోయి ప్లాస్టిక్ గ్లాసుతో నీళ్లు తెచ్చి యిచ్చింది.

అది పనివాళ్లకు నీళ్లు ఇవ్వడానికి ప్రత్యేకంగా కేటాయించిన గ్లాసు.

"మల్లికార్జును డేడీ?"

మా నాన్నను గూర్చి అడుగుతున్నాడు బసవయ్య.

"లేడు! మా నాన్న చనిపోయి పదేళ్లు కావస్తుంది!"

బసవయ్య కళ్ల నుంచి బొటబొటా కన్నీళ్లు కారాయి.

ఆయన ప్రశ్నలూ, నా సమాధానాలకు అతని ముఖంలో కలుగుతున్న మార్పులూ నా మీద ప్రభావం చూపాయి.

"మీ నాయన నాకంటే నాలుగైదేళ్లు పెద్ద. అప్పుడొచ్చినప్పుడు మీ నాయనా నేనూ సొంత అన్నదమ్ముల్లాగా ఉండేవాళ్లం!" కళ్లు తుడుచుకుంటూ బసవయ్య అన్నాడు.

నేనేమీ మాట్లాడకపోతే బావుండదని, "వీళ్లెవరు?" అని ప్రశ్నించాను.

"నా అప్పజెల్లెళ్లు. వీడు నా ఒక్కగా నొక్క కొడుకు ఈ పిల్లోడి అమ్మ ఊరి దగ్గరే ఉంది!"

నేనేమీ మాట్లాడ లేదు.

"కోటప్ప కొండ తిరణాలకు వచ్చాం– ఎట్లాగూ ఇంత దూరం వచ్చాం గదా అని మనోళ్లని చూసినట్లుంటది గదా అని ఇటొచ్చాం! పాత బస్టాండు దగ్గర దిగి పశువుల ఆసుపత్రి మీదగా, వంతెన్ల కిందగా ఇటు వచ్చాం. నా చిన్నప్పుడొచ్చిన దారి యిదే గాని, చుట్టూ ఇళ్లు మాత్రం గుర్తు పట్టడానికి వీల్లేకుండా ఉన్నయ్!"

నలభయ్యేళ్ల క్రిందటి గుంటూరుకి ఇప్పటి గుంటూరికి పోలికే లేదు. వీళ్లే గనక వోవర్ బ్రిడ్జి మీదగా వచ్చి ఉన్నట్లయితే మా యిల్లు తెలిసేదే కాదు.

క్రమంగా నాకు కొన్ని విషయాలు గుర్తుకు వచ్చాయి. మా నాన్న అప్పుడప్పుడు అంటూ వుండేవాడు మల్లాయపాలెంలో మనవాళ్లున్నారని. తన చిన్ననాడు అక్కడికీ ఇక్కడికీ రాకపోకలుండేవని గూడా చెబుతూ ఉండేవాడు. బహుశా తాతయ్య పోయిన తరువాత వాళ్ల సంగతి పట్టించుకునే వాళ్లు లేక ఆ సంబంధం తెగిపోయి వుంటుంది.

"మీ తాత ఎంత మంచోడు. చుట్టాలంటే పడి చచ్చేవోడు. ఆ రోజుల్లో ఆయన కొంత దూరం రైలు మీదా కొంతదూరం నల్లమల అడవుల్లో నడిచీ ఎన్నో కష్టాలు పడి మా వూరికి చేరేవాడు మీ తాతా, మా నాయనా అన్నదమ్ముల పిల్లలు!" బసవయ్య ఈ చివరిమాట అనగానే నా మనసు పూర్తిగా మారి పోయింది

ఈ బసవయ్య మాకు ఇంత దగ్గర చుట్టమా! ఇంత కాలం నా భార్య తరపు చుట్టాలనే గాని మా నాన్న తరపు చుట్టాలను ఎరుగని నాకు ఈ మాటలు అమృతసేచన మయ్యాయి.

బసవయ్యమీద నాకు అభిమానం కలిగింది.

"మీ తాత మా వూరికి వచ్చేసరికి నేను అడుకుంటూ ఉండేవాణ్ణి నన్నెత్తుకొని అక్కడే కూలబడి అదేపనిగా ఏడిసేవాడు మీ తాత ఆయనకు సుట్టాలంటే అంత యిది!"

గత కాలపు స్మృతులతో బసవయ్య చలించిపోయి గద్గద స్వరంతో మాట్లాడలేక పోయాడు. ఆయన వెంట వచ్చిన ఆడవాళ్లు కళ్లు తుడుచుకుంటున్నారు.

మావిడ ఆశ్చర్యంతో చూస్తోంది.

ఛఛ! ఎంత తప్పు చేశాను! ఇంత ఆత్మీయులను

దొంగల్లాగా చూశానే!

నన్ను నేనే నిందించు కున్నాను. నా భావాన్ని గ్రహించి మావిడ ఆ ఆదవాళ్లను లోనికి తీసుకొని పోయింది.

నేను బసవయ్యను నా మంచం మీద కూర్చోబెట్టాను. ఆ పిల్లాణ్ణి నా ఒడిలో కూర్చోబెట్టు కున్నాను.

"అసలు మనదంతా ఒకటే కుదురుకదంటయ్యా! మనది అసలు నెల్లూరు దగ్గర. అయితే మా తాత పెద్ద మడిసిగా అందరికీ అడ్డం వుండి అప్పు లిప్పించాదంట. మాటంటే పడే మడిసి గాదు ఆయన. అప్పులన్నీ ఎగ్గొట్టగా, అప్పులిచ్చిన వాళ్ళు అనే మాటలు పడలేక అడ్డం వున్న నేరానిగ్గాను ఆస్తులన్నీ వాళ్లకే ఇచ్చేసి, ఆ వూళ్ళో ఉండలేక బతుకుతెరువు ఎతుక్కుంటూ నందేల దగ్గరకు వచ్చారు. అక్కడే మల్లాయపాలెంలో మా నాయన స్థిరపడ్డాడు. మీ తాతావాళ్ళేమో ఇక్కడకొచ్చారు!"

ఎక్కడి కెక్కడ? ఎవరి కెవరు?

ఇంత దగ్గరి బంధువులు కూడా ఒకళ్ల నొకళ్ళు గుర్తు పట్టే స్థితి గూడా లేకుండా పోయిందే!

"ఇన్నాళ్ల నుండీ ఎందుకు రాలేదు?" వాళ్లను తప్పుపడుతూ ప్రశ్నించాను.

"అక్కడ నాకు దిక్కా మొక్కా? నలుగురు అక్క చెల్లెళ్ళు! వాళ్ల మంచీ చెడూ అంతా నేనే చూడాలా! మన యింటి పేరిటోళ్లెవరూ అక్కడ లేరాయె! నిమిషం తీరిక దొరకదు. అంతా కరువు మా పక్క. నాలుగైదేళ్ల కొకసారి వాన కురుస్తుంది. ఆ గింజలతోనే సంసారం నెట్టుకొస్తున్నాను! ఇంకెప్పుడు వచ్చేది?"

వాళ్ళు ఇంత కాలమూ ఎందుకు రాలేదని అడిగినందుకు సిగ్గు పడ్డా! అన్నీ బాగున్న నేనెప్పుడన్నా వీళ్ల సంగతి ఆచూకీ తీశానా? చివరికి వచ్చిందీ వాళ్ళే!

ఈ ఆలోచన రాగానే వాళ్లమీద ప్రేమాభిమానాలు అధిక మయ్యాయి నాకు మాత్రం ఇక్కడెవరున్నారు?

"నాకు ఒక్కగా నొక్కడు ఈ పిలగాడు వీణ్ణి ఎట్టాగైనా సదివించుకోవాల! అక్కడైతే వీడేమౌతాడో .!" అపైన చెప్పలేక బసవయ్య మౌనం వహించాడు

నా జీవితంలో ఇన్నాళ్ళూ నేను పోగొట్టుకొన్న దేమిటో నాకు అర్థమైంది కష్ట సుఖాలను హృదయం విప్పి చెప్పుకునే ఆత్మీయులైన వీళ్ళే నాకు నిజమైన బంధువులు పైగా మా యింటి పేరిటవాళ్ళు! వాళ్లకు సకల మర్యాదలు చేశాను

అంతా స్నానాలు చేసి వచ్చారు కలిసి భోజనం చేశాము

నేను బసవయ్య గోళ్ళు చూశాను. అంతా నా గోళ్ల మాదిరిగానే ఉన్నాయి. కాకపోతే కాయకష్టం చేసే ఆ వేళ్ళు మాత్రం నా వేళ్లలాగా సుకుమారంగా లేవు. తల వెంద్రుకలు మాత్రం అచ్చం నా తల వెంద్రుకల మాదిరిగానే ఉన్నాయి. ఇక ఆ పిల్లాడిని చూస్తుంటే మా వాడి పోలిక లిన్నో వాడిలో



కనుపించాయి

అయన మనసులో ఉన్న కష్టాలను సుఖాలను చెప్పుకు పోతున్నాడు

నేనూ అంతే!

ఎప్పుడూ ముక్తసరిగా మాట్లాడే నేను ఇలా మనసు విప్పి అన్నీ మాట్లాడటం చూచి మావిడ ఆశ్చర్య పోయింది

తరతరాల నాటి బంధుత్వం మాది ఇన్నాళ్ళికి కలిశాం ఆడవాళ్ళూ బాగా కలిసిపోయారు వాళ్ళందరికీ సెవంటీ యం యం ఎసి సినిమా హాల్లో ఆడుతున్న తెలుగు సినిమా చూపించాను

రెండు రోజులుండి వాళ్ళు తిరిగి ప్రయాణానికి సిద్ధపడ్డారు ఇంకో రెండు రోజు లుండమని ఎంత బతిమిలాడినా వినలేదు ఆడవాళ్ళందరికీ జాకెట్టు ముక్కలూ, పసుపు కుంకుమలూ, పూలూ, పండ్లూ ఇచ్చాం రైల్వేస్టేషనుకు పోయి అందరికీ వీడ్కోలు చెప్పాను

నన్ను వాళ్ళ ఊరు రమ్మని మరీమరీ చెప్పి, కళ్ళు తుడుచుకుంటూ రైలెక్కారు వాళ్ళు

తొందర లోనే వాళ్ళ వూరికి పోయే అవకాశం వచ్చింది నాకు

సమ్మె!

అధ్యాపకులు తమ ముప్పయ్యేడు కోరికలను తీర్చాలిసిందేనని సమ్మె మొదలు పెట్టారు పబ్లిక్ పరీక్షల ముందు సమ్మె చేస్తే ప్రభుత్వం చచ్చినట్లు లొంగిపోయి కాళ్ళ బేరానికి వస్తుందని మా నాయకుల నమ్మకం.

మల్లాయపాలెం పోయి రావడానికి ఇదే మంచి సమయం సెలవు పెట్ట నవసరం లేకుండానే ఇష్ట మొచ్చినన్ని రోజులు గడపవచ్చు అదేమంటే సమ్మెలో ఉన్నామనవచ్చు

కొంత దూరం రైలు ప్రయాణం మరికొంత దూరం బస్సులో నాలుగైదు మైళ్ళు కాలినడక చివరకు ఎలాగో మల్లాయపాలెం చేరుకున్నా

ఇప్పుడే ఆ ఊరికి చేరడం ఇంత కష్టంగా ఉందే! మరి మా తాతయ్య ఎంత కష్టపడి ఆ రోజుల్లో ఈ ఊరికి చేరేవాడో! ఆ నాటి ఆత్మీయతలు అటువంటివి

పట్టణవాసపు మురికి జీవితంతో విసిగి పోయిన నేను ఈ పల్లెలో ప్రశాంతంగా పది రోజులు గడపాలని నిశ్చయించుకున్నాను

నేను వెళ్ళేసరికి బసవయ్య వాళ్ళ ఇంట్లో ఎవరో ముసలమ్మ ఉంది

నా పేరూ ఊరూ చెప్పాను

ఆమె యెంతో సంబరపడి కాళ్ళకు నీళ్ళిచ్చింది నులక మంచం వాల్చి, దుప్పటి వేసి కూర్చో బెట్టింది ఆమె బసవయ్య చిన్నమ్మ అని మాటల సందర్భంలో తెలిసింది.

'ఎక్కడకు వెళ్ళారు వీళ్ళంతా? అన్నాను ఆమె కాసేపు తటపటాయించి, చివరకు చెప్పింది

ఆ వూరికి పన్నెండు మైళ్ళ దూరంలో నల్లమల అడవి వుంది. ఇంట్లో వాళ్ళందరూ అడవిలో ఆకులు తేవడానికి పోయారు ఆ ఆకులతో




# నిర్ణయం

విస్తరాకులు కుడతారు వంద విస్తరాకులకు మూడు రూపాయ లిచ్చి దళారీలు ఇక్కడ నుండి వాటిని తీసుకొని పోతారు

నాలుగేళ్ళ నుండీ ఆ ప్రక్క వర్షాలు లేవు చేయడానికి పనులు లేవు మేతలేక గొడ్లు వట్టిపోయాయి. ఇంటిల్లిపాదీ ఈ విస్తరాకుల పని మీద ఉంటేగానీ ఇల్లు గడవదు.

వాళ్ళ దుర్భర పరిస్థితి వింటుంటే నాకు వణుకు పుట్టింది

నెలకు మూడు వేల రూపాయలు జీతం వస్తుంటే అవి చాలవని పది పెంచండీ, పరక పెంచండీ అని మేము ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నాం

మరి వీళ్ళు ఎవరిమీద సమ్మె చేయాలి? ఒక్క రోజు అడవికి పోకపోతే అంతా మలమలమాడి పోతారు

ఇటువంటి దుర్భర స్థితిలో ఉండి గూడా వాళ్ళే మా వూరు వచ్చి నన్ను చూచి వెళ్ళారు అన్నీ ఉండి కూడా నేను నా కుటుంబం సంగతే తప్ప ఈ బంధువుల సంగతే పట్టించుకో లేదు

ఏమిటి చదువు వలన ప్రయోజనం? తెలివిగా తమ వాదాలను సమర్థించు కోవడానికి, ఎక్కువ డబ్బు సంపాదించు కోవడానికి, ఇతరులను మోసం చేయడానికి పనికి వస్తోందే తప్ప పొరుగు వాడికి తోడు పడటానికి ఏమైనా పనికి వస్తోందా?

మేధావులను బజారున పడవేయ వద్దు అని మా నాయకులు రోజూ ఉపన్యాసా లిస్తున్నారు సాటి మనుషులు కరువుతో అల్లాడి పోతుంటే, మూడు వేలు జీతం చాలదని సమ్మె చేయడమేనా మేధావి తనం?

నాకు సిగ్గు వేసింది

వీళ్ళ కోసం నేనేం చేయగలను . .

"ఈ పాటికి తిరిగి బయలుదేరే వుంటారు!" ముసలమ్మ అన్నది

వెచ్చగా గాలి వీస్తోంది వడగాలి ఇక్కడ చాలా ఎక్కువగా వుంది అది పూరిల్లు గాబట్టి సరిపోయింది టైం చూశాను. రెండయింది

ఇంత మండు టెండలో పన్నెండు మైళ్ళు నడిచి రావాలా వాళ్ళు?

రెండు మైళ్ళ దూరంలో ఉన్న కాలేజీకి పోవడానికి కారు లేదే అని బాధపడిన నాకూ, కాలే కడుపులతో మండు టెండలో మైళ్ళకొలదీ నడిచే వీళ్ళకూ ఎంత వ్యత్యాసం!

మాకు వానొస్తే సెలవు ఎండ ఎక్కువగా ఉన్నా సెలవే! ఛస్తే సెలవు పుడితే సెలవు

మరి వీళ్ళకి?

ఏ లేబర్‌యాక్ట్ వీళ్ళని రక్షిస్తుంది?

ఒక్క రోజు సెలవు తీసుకుంటే ఏ యూనియన్ వీళ్ళకి అన్నం పెడుతుంది

ఇలాంటి ఆలోచనలతో నే సాయంత్రం అయింది

మా వాళ్ళంతా నెత్తి మీద మూటలతో ఇంటికి వచ్చారు

నన్ను చూచి బసవయ్య పరమానందభరితు డయ్యాడు

ఎప్పుడో తెల్లవారు జామున వెళ్ళిన మనిషి అందులోనూ ముసలివాడు తన కష్టమంతా క్షణంలో మరచిపోయి నన్ను ఆప్యాయంగా కుశల ప్రశ్నలు అడుగు తున్నాడు

బసవయ్య భార్య కొడుకును వెంట బెట్టుకొని పోయి, ఊరవతల ఉన్న బావి నుండి గబగబా నీరు తెచ్చి గాబునిండా పోసింది అడవి పుల్లలతో నీళ్ళు కాగబెట్టి, నన్ను స్నానానికి పిలిచారు

నా వలన ఇవాళ వీళ్ళకు అదనపు శ్రమ కలుగుతున్నందుకు నొచ్చుకుంటూ స్నానం ముగించాను

నా కోసం వరి అన్నం వండారు వాళ్ళు రోజూ తినే జొన్న సంగటే నాకు కూడా పెట్టమంటే బసవయ్య భార్య అందుకు ఒప్పుకోలేదు

మెట్ట పంట అవడం వలన వరి అన్నం సువాసన వేస్తోంది పప్పుచారు కలుపుకొని అమృతోప మానంగా భోజనం చేశాను చేయి కడుక్కున్న తరువాత వద్దన్నా వినకుండా బసవయ్య కండువాతో నా చేతిని తుడిచాడు

నా కళ్ళు చెమ్మగిల్లాయి

వాళ్ళ ఆదరణ నన్ను వివశుణ్ణి గావించింది

ఏమిటి మన నాగరికత? ఇంటికి వచ్చిన వాళ్ళను దొంగలని అనుమానించానే!

మరి ఇక్కడ? ఈ మారు మూల గ్రామంలో నిరక్షరాస్యుల్లో ఉన్న సంస్కారం, ప్రేమాభిమానాలూ హృదయాన్ని ఆర్ద్రం చేస్తున్నాయి.

మరుసటి రోజు వాళ్ళు ఆకులు తేవడానికి అడవికి పోలేదు.

రెక్కాడనిదే డొక్కాడని పేదలు వీళ్ళు!

వీళ్ళకి కాజువల్ లీవులు లేవు! మెడికల్ లీవులు ఉండవు! ఎరన్ లీవ్, స్పెషల్ లీవ్, పబ్లిక్ హాలిడేస్, నెగోషియబుల్ హాలిడేస్ , ఏ లీవులూ లేవు

ఇవన్నీ వున్న వాళ్ళకే, సెలవులు, సమ్మెలు!

నా పరిస్థితి గుర్తుకు వచ్చింది

ఆనందంగా పది రోజులు ప్రశాంత ప్రకృతిలో గడపాలనే నా ఆశ వెనుక ఎంత మోసం ఉంది?

నా కోసం వీళ్ళు చేస్తున్న త్యాగం డబ్బుతో కొలవలేనిది

వీళ్ళ ఋణం తీర్చుకోవడం ఎలా?

నేనిక్కడ ఉంటే వీళ్ళను మరింత ఇబ్బంది పెట్టడమే అవుతుంది

తెల్లవారగానే వెళ్ళి పోవాలని వెంటనే నిర్ణయించుకున్నాను

నులక మంచాలు బయట వేశారు అంతా హాయిగా ఆరు బయట పండుకున్నాం

పున్నమి వెన్నెల దిగంతాల దాకా వ్యాపించి వుంది

పగలంతా వాతావరణం మండి పోతూ ఉన్నా, సాయంకాలానికి చల్లబడి పోయింది

బసవయ్య కాసేపు తన బాల్య స్మృతులను వర్ణించాడు

" . నా కొక్కటే దిగులుందయ్యా! ఒక్కగా నొక్క కొడుకు నాకు! వాడికి ఆరోగ్యం బాగుండదు ఇక్కడ మంచి డాక్టర్లు గూడా లేరు. చదువూ అబ్బటం లేదు ఎంత ఖర్చయినా, ఎంత కష్టమైనా ఫరవా లేదు వాణ్ణి కాలేజీ చదువు చదివించాలి! మన యింటి పేరిట వాళ్ళు ఇక్క డెవరూ లేరు నా తరవాత వాడికి ఇక్కడ దిక్కూ మొక్కూ ఉండదేమో !"

# నిర్ణయం

బసవయ్య గొంతు గాద్గదికమైంది

నేను పలక లేదు

'నిద్రపో! ప్రయాణం చేసి వచ్చావేమో పాపం అలవాటు లేని వాడివి నడవటం కష్టమే! ఈసారి వచ్చేటప్పుడు ముందు ఓ కార్డుముక్క రాస్తే ఎడ్లబండి కట్టుకొని బస్టాండుకు వస్తాం "

అనురాగ సూచకంగా ఇలాంటి మాటలు మాట్లాడుతూ బసవయ్య నిద్రలోకి జారుకున్నాడు

నాకు మాత్రం చాలా సేపు నిద్ర పట్టలేదు

దేశంలో, ఇలాంటి కష్టజీవులంతా పిల్లలమీద ఎన్ని ఆశలు పెట్టుకొని జీవిస్తున్నారో కాయకష్టం చేసి పిల్లలను వీళ్ళు చదివిస్తున్నారు

మరి మేము? పరీక్షల ముందు సమ్మెలు చేస్తున్నాం. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నాం.

తెలియని వాళ్ళ సంగతి సరే! ఈ పరిస్థితులన్నీ ప్రత్యక్షంగా చూచిన తరువాత గూడా నేను సమ్మెలో పాల్గొనడం న్యాయమా? పాల్గొన గూడదు!

పొద్దున్నే బసవయ్య కొడుకు ఒక మంచి లేత వేపపుల్ల తెచ్చాడు నేను చేతితో అందుకోబోతే, ఒడి పట్టండి!" అని నా ఒడిలో వేపపుల్ల వేసి పోయాడు

అవును మన ఆచార వ్యవహారాలు నాకంటే ఈ పిల్లాడికే బాగా తెలుసు.

"బాగా నిద్ర పట్టిందా?" అంటూ బసవయ్య పళ్ళు తోముకుంటూ వచ్చి ప్రశ్నించాడు

నేను ఆ ప్రశ్నకు బదులు చెప్పకుండా, "నేను ఊరికి వెళుతున్నాను!' అన్నాను

బసవయ్య ఆశ్చర్యపడ్డాడు, బాధ పడ్డాడు. 'పేదవాళ్ళం నీకు తగిన మర్యాదలు చేయలేం" అన్నాడు

"ఛఛ! అదేం కాదు! సెలవల్లో వు ఈసారి వచ్చినప్పుడు పది రోజులుంటా!" అన్నాను

బసవయ్య ఏం మాట్లాడలేదు

నేను ఒక నిర్ణయానికి వచ్చాను

మీ అబ్బాయిని నా వెంట పంపండి మా యింట్లోనే ఉంచి చదివిస్తా!' అన్నాను.

బసవయ్య ఆనందాతిశయంతో తల మునకలవుతూ ఆర్ద్ర నేత్రాలతో నా వైపు చూశాడు

"అరేయ్! బాబూ! బట్టలు సర్దుకో వెళదాం!' అన్నాన్న నేను

ఆ పిల్లాడి కన్నుల్లో వెల్లివిరిసిన కాంతిని చూచి చెప్పలేని ఆనందానుభూతితో నా మనసు నిండిపోయింది □